


శంకరం ఆ రోజు చాలా ఆనందంగా వున్నాడు. తను పుట్టి పెరిగిన ఊళ్ళో టీచర్‌గా ఉద్యోగం రావడం ఎవరికయినా ఆనందమే మరి. ఈ శుభవార్త అందరికీ చెప్పాలి. ముఖ్యంగా ప్రైవేట్ మాస్టారికి. 'ఆయన వింటే ఎంత సంతోషపడతారో!' అనుకున్నాడు.

మాస్టారంటే శంకరానికి భక్తి, గౌరవం. అందుకే ముందుగా ఆయనకి చెప్పడానికి బయలుదేరాడు. శంకరం వెళ్ళేసరికి పిల్లలకి పాఠాలు చెబుతున్నారాయన. పేరు ధర్మరాజైనా ప్రైవేట్ మాస్టారిగానే ఆ ఊళ్ళో అందరికి తెలుసు. శంకరానికి ఉద్యోగం వచ్చిన స్కూల్లోనే టీచర్‌గా పనిచేసి, రిటైరై, ఇలా ప్రైవేట్‌లు చెప్తుకుంటూ ఆ ఊర్లోనే ఉండిపోయారు కొడుకుల దగ్గరికి వెళ్ళడానికి ఆత్మాభిమానం అడ్డొచ్చి.

శంకరాన్ని చూస్తూనే "నువ్వటోయ్ శంకరం, ఏమైపోయావిన్నాళ్ళూ?" అంటూ ఆప్యాయంగా పలకరించారాయన. తనకి ఉద్యోగం వచ్చిందనే సంగతి చెప్పగానే సంతోషపడిపోయి తన పక్కనున్న కుర్చీ చూపించారు కూర్చోమని. మాస్టారిపై వున్న భక్తితో, గౌరవంతో ఆయన పక్కన కూర్చోలేక "ఫర్వాలేదండి" అన్నాడు నిల్చునే.

"ఏమిటిదంతా నా మీద భక్తేనా? అల్లరి చేసావని రెండు దెబ్బలేస్తే దూరంగా పారిపోయి 'ఒరేయ్ మేట్టారూ నన్ను కొడతావా! మా నాన్నతో చెప్పి నిన్నేం చేయిస్తానో చూడు' అని అరిచేవాడివి కదరా! ఆ అల్లరి అంతా ఏమైంది. ఇంత భక్తి ఎలా వచ్చింది. నా అంతటి వాడివయ్యావు. ఇంకా నా దగ్గర భయమేమిటి? ఫర్వాలేదు కూర్చో" అన్నారాయన నవ్వుతూ.

అంతమంది పిల్లల ముందు తన అల్లరి గుర్తు చేసేసరికి సిగ్గుపడిపోయి ఇబ్బందిగా కూర్చున్నాడు శంకరం. పిల్లలంతా ఆసక్తిగా చూస్తున్నారు శంకరం వైపు. మరికొంచెంసేపు మాట్లాడి శలవు తీసుకున్నాడు.

****

ఉద్యోగంలో జాయినయ్యాం తరువాత ఓ రోజు శంకరం ఇంటి పక్కింటాయన వచ్చి "మా గిరి క్లాస్‌కి నువ్వు పాఠాలు చెపుతావటగా. సాయంత్రం ట్యూషన్ కూడా చెప్పవయ్యా. క్లాస్ టీచర్ అంటే భయంతోనైనా బాగా చదువుతాడు అన్నారు. శంకరం వప్పుకున్నాడు. ప్రైవేట్‌కి వచ్చేవాళ్ళ సంఖ్య రోజు రోజుకి పెరిగిపోయింది. సాయంత్రం కూడా ఖాళీయే కదాని శంకరం కూడా ఎవర్నీ వద్దనలేదు. రెండు చేతుల్లా డబ్బు సంపాదిస్తున్నాడు. ప్రొద్దుటంతా స్కూల్‌కి, సాయంత్రం ట్యూషన్‌కి సరిపోతోంది టైం. నెల రోజులు గడిచేసరికి శంకరం ఇల్లు పిల్లల్తో కిటకిటలాడిపోయింది.

ఆ రోజు ఫస్టు. శంకరం వెళ్ళేసరికి వాలుకుర్చీలో కళ్ళు మూసుకొని పడుకొని వున్నారాయన. నిద్రపోతున్నారో లేదో చెప్పడం కష్టం.

"మాస్టారూ" పిలిచాడు నెమ్మదిగా.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచి "నువ్వా శంకరం. రా కూర్చో" అన్నారు.

ఆ అరుగు గచ్చు మీద కూర్చుంటూ "బావున్నారా మాస్టారు" అంటూ పలకరించాడు. ఆ ఇంట్లో కొట్టొచ్చినట్టు కనపడుతున్న లోపం ఏమిటాని ఆలోచిస్తుంటే శంకరానికి టక్కున స్ఫురించింది. ఎప్పుడూ పిల్లల అరుపులతో, మాస్టారి కేకలతో పెళ్ళిల్లులా కళకళలాడుతూ వుండే ఆ ఇల్లు పెళ్ళికూతురు అత్తారింటికి

వెళ్ళిపోయిన తర్వాత ఏర్పడ్డ స్తబ్దతలా నిశ్శబ్దంగా వుంది.

"పిల్లలేరి మాస్టారూ. ఈ రోజు శెలవా?" అన డిగిన శంకరాన్ని చూసి నవ్వి, "వయసైపోతోంది కదా! పాఠాలు సరిగ్గా చెప్పలేకపోతున్నానని నేనే పిల్లల్నెవర్నీ రావద్దని చెప్పేసాను" అన్నారు. ఆ ఇల్లెందుకంత నిశ్శబ్దంగా వుందో, ఆయనెం దుకంత ముక్తసరిగా మాట్లాడుతున్నారో శంక రానికి ఒక్కసారిగా అర్థమయిపోయింది.

"నిజం చెప్పండి మాస్టారూ! మీరు చెప్పన న్నారా, వాళ్ళే మానేశారా? నాకు తెలుసు ఇక్కడి పిల్లలేగా నా దగ్గరికి వచ్చేది. ఛ..ఛ.. ఇంత మూర్ఖంగా ఎలా వున్నానిన్నాళ్ళూ. నా మీద కోపంగా లేదు మీకు? ఉండే వుంటుంది. కానీ, నిజంగా నాకేం తెలీదండీ. నా అంతకు నేనెవరికి చెబుతాననలేదు! వాళ్ళొచ్చి అడిగితే సరే అన్నాను కాని, నిజం నా తప్పేం లేదు. నన్ను నమ్మరూ" అన్నాడు. తన నిర్దోషిత్వాన్ని నమ్మితే చాలన్నట్లు.

మాస్టారు నవ్వేరు.

"అయినా ఇప్పుడేమయ్యిందని ఇలా బాధ పడుతున్నావు. నా శిష్యుడు గొప్పవాడైతే నా కంటే గర్వపడేదెవరూ. నా కిప్పుడేం తక్కువ యిందని. హాయిగా వున్నాను. పిల్లల గొడవ లేకుండా" నవ్వడానికి ప్రయత్నించారాయన.

"లేదు మాస్టారూ! నేనెంత ఘోరం చేశానో మీకు తెలీదు. ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు. వాళ్ళందరిని మీ దగ్గరికి పంపేస్తాను" అన్నాడు.

"నువ్వు పంపితే మాత్రం నేనెలా చెబుతాన నుకున్నావు?"

"మీరు చెప్పలేనిది నేను చెప్పగలిగేది ఏముం దని?" బాధగా అనుకున్నాడు. తను మాస్టారి కంటే గొప్పగా ఏమీ పాఠాలు చెప్పలేడని, ప్రైవేటు పిల్లలంటే వున్న అభిమానంతోనైనా పరీక్షల్లో కాపీలు కొడ్తే చూసి చూడనట్టు వదిలేస్తాడని, పరీక్షల ముందు గెస్ పేపర్లు చెప్పి సాయం చేస్తాడన్న ఆశతో ఆ పిల్లల తల్లిదండ్రులు తన దగ్గర ప్రైవేట్ చెప్పిస్తున్నారని శంకరానికి తెలుసు. అతని ఆలోచన్లు తెగ్గొడుతూ –

"ఒరేయ్ శంకరం! జీవితంలో ఇప్పుడిప్పుడే స్థిర పడుతున్నవాడివి, ఎన్నో ఆటుపోట్లు తట్టుకోవ లసిన వాడివి. ఇంత చిన్న విషయానికి ఇలా తల్లడిల్లిపోతే ఎలారా?" అన్నారు.

"ఇది చిన్న విషయమా మాస్టారూ! నిజంగా చిన్న విషయమా! మీ జీవనాధారం చిన్న విష యమా! చెప్పండి మాస్టారు. చెప్పండి" అడుగు తూనే వున్నాడు శంకరం.

"ఆ విషయం గురించి ఇక ఆలోచించకు శంకరం. వెళ్ళిరా!" కుర్చీలోంచి లేస్తూ అన్నా రాయన.

బాధగా వెళ్ళిపోతున్నవాడల్లా వెనుదిరిగి "మాస్టారూ! గురుదక్షిణగా అయినా ఇది తీసు కోండి" అంటూ కొంత డబ్బు ఆయన చేతిలో పెట్టాడు.




"ఏ నెలకా నెల జీతం తీసుకునేగా నీకు విద్య నేర్పాను. ఇంకా గురుదక్షిణేమిటీ?" నవ్వా రాయన.

"మీరు నూరిపోసిన నైతిక విలువల సారాంశం, మీరు రూపుదిద్దిన ఈ వ్యక్తిత్వం ఏమిస్తే మీ ఋణం తీరుతుందో చెప్పండి. ఆ డబ్బు నా తొలి సంపాదన. తొలి సంపా దన అపురూపమైనదంటారు. ఇన్నాళ్ళూ జీతం తీసుకోగానే అమ్మకి చీర కొందామా? నాన్నకి బట్టలు కొందామా అని ఆలోచించాను. కానీ ఖచ్చితంగా అంతకంటే మంచి పనే చేస్తున్నాను అన్న తృప్తి అయినా నాకు మిగులుతుంది. మిమ్మల్ని అవమానిద్దామని కానీ, సహాయ పడదామని కానీ ఈ పని చేయలేదు. నా తొలి సంపాదనతో ఒక మంచి పని చేస్తున్నా నన్న తృప్తి కోసం ఇస్తున్నానంతే. దయచేసి తీసుకోండి" అనేసి వెళ్ళిపోయాడు శంకరం. (ఇక్కడ – "కృతజ్ఞతతో మాస్టారి కంట నీరు తిరిగింది" అని వ్రాద్దామనుకున్నాను.) కానీ ... మాస్టారు నవ్వుకున్నారు.

శంకరం అంతకన్నా ఎక్కువగా 'వదులుకుని' నైతిక ధర్మానికి న్యాయం చెయ్యలేకపోయాడు. బ్రతకనేర్వటానికి అంతవరకు మాత్రమే త్యాగం చేయగలిగాడు.

జీవితంలో చదువనేది ఎంతవరకూ ఉపకరి స్తుందో శంకరానికి నేర్పగలిగారు గానీ, జీవిం చటంలో వుండే 'నైతిక ధర్మాన్ని' నేర్పలేకపో యారు. శంకరం కూడా తన దగ్గరికి ప్రైవేట్ కొచ్చే పిల్లలు కేవలం పరీక్ష పాసయ్యే సౌలభ్యం కోసమే వచ్చారుకానీ తను మాస్టారి కంటే గొప్పగా చెబుతానని మాత్రం కాదనే విషయం తెలిసినప్పటికీ, తిరిగి ఆయన దగ్గరికి పిల్లల్ని పంపక, ఒక నెల జీతం త్యాగం చేసి, తన ఇగో సంతృప్తిపరుచుకున్నాడు.

అందుకే మాస్టారు నవ్వుకున్నారు.